# కాలం కాదు..జ్ఞానం

–బి.వి. రమణరావు

మా అబ్బాయి మధు, మా కోడలు జానకి, ఏడాది చంటాడు బెడ్‌రూంలో ఎయిర్ కూలర్ పెట్టుకు పడుకు న్నారు. మా గదిలోనూ ఎయిర్ కూలరుంది కాని, చల్లదనం మాటెలావున్నా, దాని హోరు నాకు కిట్టదు. పైగా మా యిద్దరివీ కాస్త స్థూలకాయాలు. అంచేత డాబా మీద టేబుల్ ఫేన్ పెట్టుకు పడుకుంటాం. ఓ నెల్లాళ్ళుందామని వొచ్చిన మా అమ్మతోబాటు, మా అమ్మాయి శుభ హాల్లోనే పడుకుంది.

నిత్యం తనకి నిద్ర పట్టేవరకూ ఏదో లోకాభిరామాయణం చెబుతూ నాకు నిద్ర పట్టనివ్వకపోవడం మా ఆవిడకి పరిపాటి. ఆరోజు సాయంత్రం తనిప్పుడు పెళ్ళి చేసుకోనని శుభవాదించిందిట. దానికి పరోక్షంగా మా మధు, జానకి మద్దత్తిచ్చేరుట. అంచేత దాని పెంకితనం గురించీ, పెరిగే దాని వయస్సు గురించీ, నా నిర్లక్ష్యం గురించి సోదారహణగా, సహేతుకంగా మా ఆవిడ నా చెవుల్లో నూరిపోస్తుంటే ఊకొడుతూ కునికిపాట్లు పడుతున్నాను. ఇంతలోనే కింద గదిలో, మా మనవడు కించిత్ కెవ్వుమని, తర్వాత ఏడుద్దామా మాన్దామా అన్న సందిగ్ధంలో నెమ్మదిగా సప్తస్వరాలు ఆలపిస్తున్నాడు.

''హు! చంటాడు లేచినట్టున్నాడు. వొంటింట్లో లైటు వెలుగుతుంది, జానకి పాలు కాస్తున్నట్టుంది, మధు పాపం నిద్రోతున్నాడు, శుభ యిప్పుడు టీవీ సీరియల్స్ చూస్తూ కూర్చుంటుంది. గుళ్ళో పురాణం నుంచి రావడం ఆలస్యమైంది కదా, అత్తయ్యగారిప్పుడే ఫలహారం చేసి పడుకుంటారు'' అంటూ లేవబోతుంది.

''నోరు మూసుకుని కదలకుండా పడుకో. వాళ్ళతంటాలు వాళ్ళు పడటం నేర్చుకోనియ్యి'' అని అదిమిపెట్టేను.

ఇంతలోకే జానకొచ్చి నెమ్మదిగా వాణ్ణి జోకెడుతూ లాలిపాట మొదలెట్టేటప్పటికి, వాడు రకీమని లేచి తేలు కుట్టినట్టు ఏడవడం మొదలెట్టేడు. మధుకి మెళుకువొచ్చినట్టుంది. గట్టిగా ఆవలించేడు. మరి ఆ ఆవలింత ఒకింత వింతగా తోచిందేమో వెంటనే ఏడుపు మానేసినట్టున్నాడు.

''నీ జోల పాటకి జడుసుకున్నట్టున్నాడు'' అన్నాడు మధు.

''ఉహూ! అయితే కాస్సేపు ఆవలిస్తూ నిద్రోకొట్టు. కిచెన్‌లో పాలు స్టౌమీదున్నాయి. అయిదు నిమిషాల్లో వొస్తాను'' అంటూ వెళ్ళబోతున్నట్టుంది. ''ప్లీజ్ జానకీ, పాలు నేను కాచి తెస్తాను. వీడి సంగతి చూసుకో'' అంటూ చంటాణ్ణి తీసుకుని వెంబడిస్తూన్నట్టున్నాడు.

ఇప్పటికీ తన సామ్రాజ్యమైన వొంటింట్లోకి నాకు ప్రవేశం లేదన్న నిషేధాజ్ఞ ధర్మమా అని నాకు వొంటింట్లోకి వెళ్ళడమే భయం. మా కోడలు ధర్మమా అని అలాంటి బహిష్కరణేమీ మా మధుకి లేదు. ఇప్పుడు మా వాడు కోడలు మధ్య బాధ్యతలు పంచుకోవడంలో జరిగిన రసవత్తరమైన సంభాషణా సరళిని గురించి, కాలగతిని గురించి రెండుక్షణాలు కళ్ళు మూసుకుని ఆలోచించడం మొదలెట్టేను.

''ఒరే సుబ్బారావు!'' అన్న పిలుపు వినబడింది. ఎవరో నా పేరెట్టి పిలిచేరు; సందేహం లేదు. ఆడగొంతు, మా అమ్మ కాదు. మా అమ్మయితే ''ఒరే సుబ్బులూ!'' అంటుంది. అయినా చెప్పాచెయ్యకుండా ఇంతరాత్రి వేళ డాబా ఎందుకెక్కుతుంది! ఇది నా భ్రమే అయివుంటుంది. లేదా సినీమాల్లోలాగా నా అంతరాత్మ సంబోధించిందేమో అనుకుంటుంటే ''ఒరే! సుబ్బారావు!'' అన్న స్వరం ఈసారి స్పష్టంగా వినబడింది. లేచి కూర్చుని మా ఆవిడ మొహంలోకి తేరిపారి చూసి ''సుందూ!'' అన్నాను, నువ్వేనా అన్నట్టు.

''అవును నేనే పిలిచేను. నువ్వేమిటా పిలుపు! సుందూ, సందూ గొందూ అంటూ! సుందరీ అని పిలవ లేవూ!'' అంది లేచి నిలబడి. నాకు భయమేసింది.

ఆమె మొహంలో రౌద్రం తాండవిస్తుంది. ఏ భూతం ఆవహించిందో తెలీదు. నేనొక్కణ్ణే వున్నాను. తను సులభంగా నిలబడింది. నాకు కీళ్ళ నెప్పులు, ఓ పట్టాన చటుక్కున లేవలేను. ఈపళంగా జుట్టట్టుకు రెండు తన్నులు తన్నిందంటే ఏం దిక్కు! ఎంత అప్రతిష్ఠ!

''ఏమిటలా పిలిచేవు?'' అడిగేను కాస్త శాంతం మొహానికి పులుముకుని.

''ఏ! సుబ్బారావూ అని పిలిచేను తప్పా?''

''తప్పులేదు రా, సుందరీ, ఇలా కూర్చో'' అన్నాను చెయ్యి పట్టుకుని 'సుందరి' అంటుంటే ఆ పదం మీద జాలేసింది. ఏం చెయ్యను! ఇప్పుడు సాహిత్యం గురించి, వ్యాకరణం గురించీ ఆలోచించే సమయమా! ప్రాణాలతో ఎలా బయట పడాలా అని సతమతమౌతున్నాను. మొత్తం మీద ఏ కళనుందో కాస్త మెత్తబడి కూర్చుంది. కాని మొహంలో యింకా భద్రకాళి ముద్ర చెరగలేదు.

''ఎందుకు పిలిచేవు?'' అడిగేను నెమ్మదిగా.

''కదలకుండా నన్నదిమిపెట్టి నోరుమూసుకు పడుకోమంటారా! మధు నిద్రలేచి చంటాణ్ణి సముదాయించలేక అక్కడలా యిబ్బంది పడుతుంటే, మధు ఎవరనుకున్నావు. నా కొడుకు. నా ప్రాణంలో ప్రాణం. నా రక్తంలో రక్తం.''

''అవుననుకో, నా కొడుకు కూడా కదా!'' అన్నాను అనునయంగా.

''నువ్వేమైనా కన్నావా! నవమాసాలు నాతో పెరిగి నా కడుపు చీల్చుకు వొచ్చేడు. నాకడుపులో వాడి ప్రతి అణువణువూ, ప్రతి కదలికా నేను భరించేను.''

''నేను బీజం, నువ్వు క్షేత్రం.''

''చప్ నోర్మూయ్. క్షేత్రం లేకుండా బీజం లోంచి పుట్టుకొస్తాడా!''

''సారీ! తండ్రిగా నేనూ వాణ్ణి ప్రేమించేను, పెంచేను, చదువు సంధ్యలు చెప్పించేను...''

''నువ్వు చేసిందేముంది! పిల్లలిద్దరికీ ప్రాణం పోసింది నేను. వాళ్ళ ఆలనా పాలనా నేనే చూశాను. డబ్బు సంపాదించి పడేస్తే సరిపోయిందా! మధు సంగతలావుంచు, శుభ సంగతి నువ్వేమయినా పట్టించుకుంటున్నావా!''

''అది కాదు సుందూ!...''

''సుబ్బారావు!...''

''సారీ త్రిపుర సుందరీ! నువ్వు నన్ను పేరెట్టి పిలు, ఏమైనా చెయ్యి. ముందా తలుపెయ్యి. వాళ్ళు వింటే బాగుండదు.''

''వాళ్ళు వినాలి. ముప్ఫయ్యేళ్ళ మన దాంపత్య జీవితంలో సుందరీ అని ఎప్పుడైనా నోరారా పిలిచేవా?'' స్వరం హెచ్చించింది.

''ఇంకలాగే పిలుస్తానులే లే! కాస్తనెమ్మదిగా మాట్లాడు.''

''అదుగో మళ్ళీ! నేనేమో నిన్ను అండీ అండీ అని మన్నించాలా! నువ్వేమో ఏమే వొసే అంటావా!''

''క్షమించు, నోరు జారింది. అది సరే, త్రిపుర సుందరీ, నన్నిలాగ పేరెట్టి పిల్చి యిలా నిలదీసి అడగాలన్న సత్సంకల్పం ఎప్పుడు కలిగింది?''


''సాయింత్రం నేనూ జానకీ బజారుకెళ్ళేం. అక్కణ్ణుంచి యువకళా నికేతన్‌లో స్త్రీ బాధ కథల మీద మీటింగుకు వెళ్ళేం.''

''స్త్రీ బాధ కథలు కాదు, స్త్రీవాద

కథలు..స్త్రీవాదం...''

''వాదమో! వేదమో! ఎంత బాగా మాట్లాడేరు. ఇన్నాళ్ళూ ఈ మొగాళ్ళు ఆడవాళ్ళకి చేస్తున్న అన్యాయం గురించి చెబుతుంటే నా చిన్నతనమంతా గుర్తొచ్చి దుఃఖం ఆగలేదు'' అంది.

నిజమే మరి. ఇవాళ ఆమాటలేవో విని, దాని రక్తం పొంగి యిలా రంకె లేస్తుంది కాని, యిన్నాళ్ళూ తిరగబడకుండా ఎంత సహనంతో కాపరం చేసింది! ఓ చదువా! ఓ ఉద్యోగమా! ఇప్పుడు యింట్లో కుళాయిలొచ్చేయి కాని మేము కొత్తగా కాపరం పెట్టుకున్నప్పుడు వీధి కుళాయిల నుంచి పొద్దున్నా సాయింత్రం నీళ్ళు మోసుగొ



చ్చేదీ. అప్పుడీ గేస్‌స్టౌ లెక్కడున్నాయి! కిరోసిన్ స్టౌలు, కుంపట్లు, వొంటిల్లే దాని జీవితం. నాకు చాకిరీ, పిల్లలకు చాకిరీ, అతిథులకు చాకిరీ. వంటా, పూజలు, వ్రతాలు, పేరంటాలు దానివొంతు. పిక్‌నిక్‌లు, పేకాట, పార్టీలు నావంతు. ఎప్పుడేనా ఇదేమిటని అడిగిందా! నెలకోసారి సినీమాకి తీసుకెళ్ళి, సంవత్సరానికో రెండు చీరలు కొనిపెడితే పొంగిపోయింది. వాళ్ళమ్మమ్మ వాళ్ళమ్మకీ, వాళ్ళమ్మ దీనికీ, ఆడదానికి భర్త వల్ల కలిగే ఆనందం అంటే యిదే అని ఉపదేశించి వుంటారు. దాంతో ఆడది మాతృమూర్తి, గృహలక్ష్మి, పతివ్రత అన్న పోర్ట్‌ఫోలియోల కోసమే జన్మించిందని త్రికరణ శుద్ధిగా నమ్మింది. తన స్వాతంత్ర్యాన్ని గురించీ, వ్యక్తిత్వాన్ని గురించి ఆలోచించిందా!

''సరే, సుందరీ! ఇప్పుడు నీకేం కావాలి?'' అడిగేను.

''మన పెళ్ళికి నువ్వెంత కట్నం పుచ్చుకున్నావు?'' అడిగింది.

''నాకు గుర్తులేదు. ముప్ఫయ్యేళ్ళ క్రితం కదా!''

''నాకు జ్ఞాపకముంది, పదివేలు.''

''మరి అందులో నగలూ చీరలు రూపంలో నీకు...''

''సరే..అయిదు వేలు తీసెయ్యి. మిగతా అయిదు వేలు ముప్ఫయ్యేళ్ళలో ఎంతవుతుంది?''

''అంతే కదా! అంతా సంసారానికే ఖర్చు పెట్టేశాం.''

''అదంతా నాకు తెలీదు. కట్నం తీసుకున్నావు. లెఖ్ఖ కట్టి చెప్పు''

''అయిదువేలు ముప్ఫయ్యేళ్ళలో మూడు లక్షలు పైనవుతుంది.''

''ఆ డబ్బిప్పుడిచ్చెయ్యి''

''అంత డబ్బిప్పుడెక్కణ్ణుంచి తేగలను?''

''అంత చేతగానివాడివి కట్నం ఎందుకు పుచ్చుకున్నావు?''

''నేను మొగాణ్ణి నిన్ను పెళ్ళాడేను. ఆ రోజుల్లో కట్నం ఆచారం. మీవాళ్ళిచ్చేరు. మావాళ్ళు పుచ్చుకున్నారు.''

''ఆడదానికి మొగాడెంతవసరమో, మొగడాకి ఆడదంతకంటే ఎక్కువ అవసరం. ఇప్పుడు వున్న జనాభాలో ఇంచుమించు ఆడవాళ్ళకంటే మొగాళ్ళు మూడు శాతం ఎక్కువ. ప్రతీ మొగాడికీ భార్య దొరికే అవకాశం లేదు. అంచేత కట్నం అంటూ యిస్తే నువ్వే నాకివ్వాలి. ఇదంతా మీటింగ్‌లో ఉపన్యాసాల్లో విన్నాను. ఊ...డబ్బు సంగతి తేల్చు'' అంటూ మళ్ళీ లేవబోయింది.

''సుందరీ రెండేళ్ళలో రిటైరవబోతున్నాను. ప్రావిడెంటు ఫండూ, గ్రేట్యుటీ కలిపి మూడు లక్షలుపైనే వొస్తాయి. అదంతా నీకిచ్చేసాను. ప్రామిస్.'' అన్నాను మళ్ళీ లేస్తుందేమోనన్న భయంతో.

''సరే...చూస్తాను'' అంది కూర్చుంటూ.

''ఆ డబ్బేం చేస్తావిప్పుడు?'' అని అడిగేను, ముద్దుగా ఆమె బుగ్గగిల్లే ప్రయత్నంలో.

''నా డబ్బు, నా యిష్టం. శుభకిచ్చుకుంటాను. దాని పెళ్ళెప్పుడవుతుందో ఏమిటో!'' అంది నా చెయ్యి నెట్టేస్తూ.

''శుభం. అలాగే కానియ్యి. నీమాటెప్పుడైనా కాదన్నానా?''

''అలా అన్నావు బాగుంది. మరో విషయం. నా పేర్లోంచి నీ యింటి పేరు తీసేస్తున్నాను.''

''మన యింటి పేరు ఒకటే వుండటం సాంప్రదాయం.''

''గాడిదగుడ్డు. మీనాన్నకిద్దరు కొడుకులు. మానాన్నకిద్దరం ఆడపిల్లలమే. మా నాన్న వంశం పేరు మాత్రం నిలవద్దా!''

''సరే, నీ యిష్టం. నీ ఆనందమే నా ఆనందం'' అన్నాను, అనునయంగా.

''అలా అన్నావు, నాకు సంతోషంగా వుంది'' అంది చిరునవ్వు చిందిస్తూ.

''ఇంక పడుకుందామా, నిద్రొస్తుంది'' అన్నాను ఆవలింత అభినయిస్తూ.

''అప్పుడే నిద్రేమిటి!...ఇదిగో...ఇలారా...ఊ...''

అంటూ చెయ్యి పట్టుకుని తన పక్కవైపు లాక్కునే ప్రయత్నం చేస్తుంది.

''నాకు నిద్రొస్తుంది. చెయ్యొదులు...ప్లీజ్'' అన్నాను ఆమె ధోరణి వింతగా వుండటం చూసి.

''అదిగో! అదే నీ మొగబుద్ధి! నువ్వు చెయ్యి పట్టుకు లాగితే నాకు నిద్రొస్తుందంటే ఊరుకుంటావా! ఊ...రమ్మంటుంటే..రా ఇలా'' అంటూ యింకా గట్టిగా లాగుతుంది. నేను నా చెయ్యి గుంజుకుంటున్నాను.

సరిగ్గా ఆ సమయంలో మెలుకువొచ్చింది. కళ్ళు తెరిచి చుట్టూ కలియచూశాను. ''ఏమిటండీ! ఊ...ఊ...అంటూ ఒకటే పలవరింతలు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ వుంటారు. దిక్కుమాలిన కథల పుస్తకాలన్నీ చదువుతారు'' అంటూ మా ఆవిడ నా జబ్బ చరుస్తూ కనబడింది. ఎంత పీడకలొచ్చిందీ! మొన్న స్త్రీవాద కథా సదస్సుకెళ్ళిన రోజున ఈ మీటింగ్‌కి మా ఆవిణ్ణి తీసుకొస్తే ఎలా స్పందిస్తుందో అన్న ఆలోచన వొచ్చింది. దాని ప్రభావమే యిది. సందేహం లేదు.

''అబ్బే! ఏమీ లేదు. కాళ్ళు లాగుతుంటే మగత నిద్రలో మూలిగినట్టున్నాను'' అన్నాను కల మాట చెప్పకుండా.

''ఉండండి కాస్సేపు కాళ్ళు పడతాను. కళ్ళు మూసుకు పడుకోండి, నిద్రపడుతుంది'' లేచి కూర్చుని నాకాళ్ళ వైపు జరుగుతూ, ఆమె రెండు చేతులూ నా చేతుల్లోకి తీసుకుని ఆమె మొహంలోకి చూస్తూ నామీదకి లాక్కుంటూ ''ముప్ఫయ్యేళ్ళుగా నువ్వు నా కాళ్ళ నొప్పులు గురించి ఆలోచించడమేకాని, నీకెప్పుడూ కాళ్ళు నొప్పెట్టలేదా!'' అంటున్నప్పుడు బహుశా నా కళ్ళు చమర్చి వుంటాయి.

''ఏమిటలా అంటున్నారు!'' అంది చీర చెంగుతో నా మొహం తుడుస్తూ.

''అబ్బే! అదే..శుభని గురించే ఆలోచిస్తుంటే నిద్రపట్టలేదు'' అన్నాను దాని క్లిష్టమైన అంశం మీదకి సంభాషణ మళ్ళించాలి.

''దాని మొహం, అది చిన్నపిల్ల, దానికేం తెలుసు! మంచి సంబంధం చూడండి, అదే ఒప్పుగుంటుంది. అయినా అదేమిటి! మొన్నటివరకూ దాన్ని పెళ్ళి చేసుకోమని బోధించి యిప్పుడు దాని పక్షమే మాట్లాడుతున్నారు!'' అంది. నిజమేమరి.

''అవును సుందూ! ఆలోచించినకొద్దీ మనకంటే శుభకే ముందు చూపుందేమో అనిపిస్తుంది'' అన్నాను, ఆ మీటింగ్ తీగ లాగడం యిష్టం లేక.

''ఏం ముందు చూపండీ! మనకంటే దానికెక్కువ తెలుసా?''

''మనిద్దరికీ ముప్ఫయ్యేళ్ళ క్రితం పెళ్ళిచూపులయ్యేయి, గుర్తుందా? మర్నాడు నువ్వు నాకు నచ్చేవని కబురు చేశాము. అప్పుడు నీకేమనిపించింది?''

''సంతోషంతో ఎగిరి గంతేసేను. అందరూ నా అదృష్టానికి మెచ్చుకున్నారు కూడాను.''

''ఏమి ఆలోచించుకుని అంత సంతోషం?'' అడిగేను.

''ఆలోచించడం పెద్దల వంతు. పెళ్ళి కనక సంతోషించడం నావంతు.''

''మరి పెళ్ళంటే శుభ సంతోషంతో ఎగిరి గంతెయ్యటం లేదే?''

''అదే నాకర్థం కావడం లేదు. ఇరవై రెండేళ్ళొచ్చేయి. యమ్మెస్సీ అయింది. ఇంకా చదువుకుంటాను. అప్పుడే పెళ్ళొద్దంటుందేమిటో!''

''కారణం తెలుసా?''

''మూర్ఖత్వం అనిపిస్తుంది.''

''కాదు, మనం పెరిగిన ప్రపంచం, మనం నమ్మిన సామాజిక విలువలు వేరు. ఇప్పుడు శుభ చూస్తున్న ప్రపంచం తీరు వేరు. దాంపత్య జీవితం ఆనందంగా వుండాలంటే చదువు, సంస్కారం, సంపాదన, స్వాతంత్ర్యం అన్యోన్యత-ఇవన్నీ అవసరమే. ఏవిధమైన అభిప్రాయ భేదాలొచ్చినా, అభిమానం చంపుకుని భార్య కాని భర్తకానీ సమాధానపడరు. దాంతో దాంపత్య జీవితమో విషమ సమస్యయిపోతుంది.''

''ఊరుకోండి. మీరు మరీను. ఈ దిక్కుమాలిన సినీమాలు చూసి చూసి..''

''ఈ కథలు సినీమాలు ఈనాటి సామాజిక వ్యవస్థకు ప్రతిబింబాలు. కొంత అతిశయోక్తి వుండొచ్చునుకో. అలాంటి పరిస్థితులెదుర్కోవల్సివస్తే దానికావల్సిన ఆత్మవిశ్వాసం, స్వతంత్ర ధన సంపాదన, ప్రపంచానుభవం కావాలన్న వుద్దేశంతో వాళ్ళు చదువు ఉద్యోగం సంగతి ముందు చూసుకుని తర్వాతే పెళ్ళి సంగతి ఆలోచించుకోవాలంటారు. మొగపిల్లల్ని పట్టే ఆడపిల్లలూను.''

''అన్నీ అనుకూలిస్తే అదృష్టమే. ఇవే గొంతెమ్మ కోరికలై, అవి తీరక, విసుగెత్తి, వయస్సు ముదిరి ''నాకు పెళ్ళేవొద్దు'' అంటున్న ఆడపిల్లలు కనబడుతున్నారు. ఆ భయంతోనే పెళ్ళో పెళ్ళో అని గొంతు చించుకుంటాను.''

''పుట్టిన ప్రతి ఆడపిల్లకీ పిల్లల్ని కనిపెంచాలన్న కోరిక సహజమనీ, అందుకు మొగుడు కావాలి కనక పెళ్ళి చేసుకోవాలనీ యిన్నాళ్ళూ మన అభిప్రాయం. అవునా?'' అడిగేను.

''అదేమిటి! ఇప్పుడు కాదంటారా!'' అంది ఆశ్చర్యంగా.

''అవునో కాదో, కాకపోతే మరేమిటో నిర్ణయించవల్సింది కాలమేమో!'' అన్నాను, మొన్న మీటింగులో విన్న మాటలు నెమరువేసుకుంటూ.

ఇంతలోకే 'హియర్ హియర్' అన్న శుభ గొంతుతో పాటు చప్పట్లు, పకపకలు వినబడగానే మా ఆవిడ లేచి వెళ్ళి డాబా గుమ్మంలో నిలబడింది. నేనూ నెమ్మదిగా లేచి మా ఆవిడ పక్కనే నిలబడి కిందకి చూశాను. కరెంటు పోయినట్టుంది. లోపల లైట్లు లేవు. నైట్‌క్వీన్ పందిరి పక్కన మెట్ల ముందు ఆరుబయిట వెన్నెల్లో చాప పరుచుకుని కూర్చున్న మా మధు, జానకి, శుభ కనబడ్డారు. అంతకంటే ఆశ్చర్యమేమిటంటే మా అమ్మ నెమ్మదిగా మెట్లెక్కుతూ కనబడింది.

''చదువుకున్న ఆడపిల్లలకిప్పుడు పవిత్రమైన వివాహబంధంలో విశ్వాసం లేకపోలేదు. మొగపిల్లల దురంతాలు, దురాశలు కారణంగా ఆడపిల్లలు వాళ్ళ భద్రతను గురించి కూడా జాగ్రత్తగా ఆలోచించుకుంటున్నారు. అది సహజం. ఒప్పుగుంటున్నాను'' అంది మా అమ్మ.

''అది చెప్పడానికి నువ్వు పైకి రావాలా!'' అన్నాను. ఆవిడకసలే కాళ్ళు నెప్పులు.

''అందుక్కాదు వొస్తున్నది. నీ దవడ బద్దలు కొట్టడానికి.''

''నువ్వు కొడతావా?''

''నీ పెళ్ళానికి చేతకాదు కనుక.''

''పోనీ నేనే కిందకొస్తాను. ఇంతకీ ఏమన్నానని అంత కోపం?''

''ఈ సృష్టికి మూలం స్త్రీ. మాతృత్వానికి దూరమైన స్త్రీ జీవితానికి పరిపూర్ణత లేదు. నా మాటల్లో నమ్మకం లేకపోతే నీ పెళ్ళాన్ని అడిగి తెలుసుకో. పిల్లల్ని కనడానికి మొగుడే కావాలా అన్న సందేహం, అష్టకష్టాలు పడిన మీ చెల్లాయి ప్రమీలకి కూడా కలగదు. ఆ విషయం నిర్ణయించేది కాలం కాదు; మనం మృగాలం కామూ మనుషులం అన్న జ్ఞానం'' అంది.

లైట్లు వెలిగేయి. కరెంటొచ్చినట్టుంది. ఆమె మెట్లు దిగి పిల్లల వెనక్కాలే లోపలికెళ్ళింది. తలుపులు మూసుకున్నాయి. మళ్ళీ మా చీకట్లో మేమిద్దరం మిగిలేం.

★



## మళ్ళీ ఇళయరాజా సీజన్?

సుమారు ఐదారేళ్ళ క్రితం వరకూ దక్షిణాదిన సంగీత సామ్రాట్టుగా వెలిగి 'లయరాజు' అనిపించుకున్నాడు ఇళయరాజా. తనదంటూ ఓ సరికొత్త ఒరవడిని ప్రవేశపెట్టిన ఇళయరాజా దేవా, రెహమాన్, ఎస్.ఎ. రాజ్‌కుమార్ లాంటి యువ సంగీత దర్శకుల రాకతో వెనక వరసలో పడ్డాడు. అటు తమిళంలోనే కాకుండా తెలుగులోనూ ఇళయరాజాకి విజయం లభించి చాలాకాలం అవుతోంది. అయితే ఇళయరాజా సీజన్ తిరిగి మొదలవుతోందా? అనే చర్చలు సినీ వర్గాలలో వినిపిస్తున్నాయి మధ్య. 'జీన్స్' తర్వాత దర్శకుడు శంకర్ తానే నిర్మిస్తూ దర్శకత్వం వహిస్తున్న 'ఒక్కడే ఒక్కడు' చిత్రానికి ఇళయరాజానే సంగీత దర్శకుడుగా నిర్ణయించవచ్చని వినిపిస్తోంది. అలాగే మరికొంత మంది అగ్రశ్రేణి సినీ ప్రముఖులు ఇళయరాజాని తీసుకునేందుకు ఉత్సాహాన్ని కనబరుస్తున్నారట.

-జె.ఎం.